
మృతి చెందిన కార్మికులకు నివాళులర్పిస్తున్న కార్మికులు

సూపర్ మ్యాక్స్ కంపెనీ లాకౌట్ తొలగించాలి

జీడిమెట్ల, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పారిశ్రామికవాడ ప్రాంతంలోని సూపర్ మ్యాక్స్ కార్మికులు ఆకలితో అలమటిస్తున్నారని, రెండేళ్లుగా లాకౌట్‌లో ఉన్న కంపెనీని తెరవాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య కారణాలతో మృతి చెందిన 27 మంది కార్మికులకు ఆదివారం శ్రద్ధాంజలి ఘటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మూతపడిన పరిశ్రమను కాంగ్రెస్ ప్రభుత్వం అయినా తెరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భరద్వాజ్, ఈశ్వర్‌రెడ్డి, దయాకర్, ఖాసీమ్, రామచంద్రారెడ్డి, అప్పారావు పాల్గొన్నారు.

భరత్‌నగర్ సీనియర్ సిటిజన్స్ కమిటీ నియామకం

ఫతేనగర్, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్ భరత్‌నగర్ కాలనీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం భరత్‌నగర్‌లో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా బి.మాణిక్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కోటేశ్వర్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాణిక్‌రెడ్డిని అసోసియేషన్ ముఖ్య సలహాదారుడు, భరత్‌నగర్ హరిహరక్షేత్రం ఆలయ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నాగిరెడ్డి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మధుసూదన్‌రాజు, రత్నాకర్‌రావు, చెన్నకేశవ, భిక్షపతి, లక్ష్మీనారాయణ, భిక్షపతిగౌడ్, బుచ్చిబాబు, ప్రసాద్, నారాయణ, బలరామ్, రామనాథం, జానకీరామ్, గణేశ్ పాల్గొన్నారు.

గొడ్డలితో దాడి ఘటనలో మహిళ మృతి


సావిత్రి (ఫైల్)

బాలానగర్, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): పాత కక్షలతో ఓ వ్యక్తి గంజాయి మత్తులో తమ్ముడి వరసైన ఏర్పుల ముఖుందర్, తల్లి సావిత్రి(63)పై గొడ్డలితో దాడి చేసిన ఘటనలో సావిత్రి శనివారం రాత్రి మృతి చెందింది. ఆగస్టు 27న తల్లీ కొడుకుపై గొడ్డలితో దాడి చేయడంతో ముఖుందర్ అక్కడికక్కడే మృతి చెందగా సావిత్రి తీవ్రంగా గాయపడింది. అదే రోజు ఆమెను సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే శనివారం ఆమె పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. దీంతో దామోదర సంజీయ్యకాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరి మృతికి కారణమైన ఏర్పుల మధును అదే రోజు బాలానగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.


రక్తదాన శిబిరంలో ముమ్మారెడ్డి ప్రేమకుమార్ తదితరులు

పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా రక్తదానం

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదినం పురస్కరించుకొని కేపీహెచ్‌బీ ఫంక్షన్‌హాల్లో ఆదివారం చెర్రి అరవింద్, దనపాల సందీప్, జ్ఞానవర్ష ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి ముమ్మారెడ్డి ప్రేమకుమార్, కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి ఆర్కేనాయుడు, చిరంజీవి యువత అధ్యక్షుడు రమణ స్వామినాయుడు అతిథులుగా హాజరై రక్తదాన శిబిరం నిర్వాహకులు, రక్తం ఇచ్చినవారిని అభినందించారు. అనంతరం అన్న సమారాధన చేశారు.

అనాథ చిన్నారులకు నిత్యావసరాలు అందజేత


నిత్యావసరాలు అందిస్తున్న ఏకాంత్‌గౌడ్, స్నేహితులు

హైదర్‌నగర్, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): చిన్ననాటిమిత్రులతో కలిసి అనాథ చిన్నారులకు ఏకాంత్‌గౌడ్ నిత్యావసర సరుకులు అందించారు. ఆదివారం కూకట్‌పల్లి రామకృష్ణ హైస్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు, చిన్ననాటి మిత్రులతో కలిసి నవ్యశ్రీ ఫౌండేషన్‌లో బియ్యం, ఆయిల్, కందిపప్పు ఇతర నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంతోష్‌కుమార్, సురేందర్, వినోద్, మనోహర్, దుషంత్, చిన్ననాటి స్నేహితులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): గణేశ్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని భాగ్యనగర్ ఉత్సవ సమితి కొంపల్లి శాఖ కన్వీనర్ పి.సతీష్‌సాగర్ అన్నారు. ఆదివారం కొంపల్లి మున్సిపల్ ఏఎంఆర్ గార్డెన్‌లో భాగ్యనగర్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గణేశ్ మండపాల నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, రాజిరెడ్డి, శివాజీరాజు, మధు, అశోక్, నర్సింహ, గోపాల్‌రెడ్డి, ఆనంద్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

చిగురించిన శిలాజం కవితా సంపుటి ఆవిష్కరణ


వెంకటేశ్వరరావు

రాయదుర్గం, సెప్టెంబర్ 1 (ఆంధ్ర1ఎస్ఎల్‌పిపి11-మాట్లాడుతున్న ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు జ్యోతి): కంటికి కనిపించేది మాత్రమే సత్యమని, మనకి కనిపించనంత మాత్రన నిజం లేదనుకోవడానికి లేదని దాన్ని విశ్వర్షి డాక్టర్ వాసిలి వసంతకుమార్ రచించిన ఏడో రుతువులో కవితాత్మకంగా చెప్పారని హెచ్‌సీయూ తెలుగు శాఖ మాజీ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అన్నారు. అమెరికాలోని సిరికోన సాహితీ అకాడమీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ద్రవిడ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చంద్రశేఖర్ రచించిన చిగురించిన శిలాజం కవితా సంపుటి ఆవిష్కరణ డా.వాసిలి వసంతకుమార్ రచించిన ఏడో రుతువు కావ్య పరిచయాలను చేశారు.

ఐఎస్‌బీలో స్పార్క్ 2.0 స్టార్టప్ కాన్‌క్లేవ్

రాయదుర్గం, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో స్పార్క్ 2.0 స్టార్టప్ కాన్‌క్లేవ్ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ ఐటీ కార్యదర్శి, పరిశ్రమలు, వాణిజ్యం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్‌రంజన్ హాజరై కీలకోపన్యాసం చేశారు. ఐఎస్‌బీ వ్యవస్థాపక అభివృద్ధికి సహాయం చేయడంలో డీల్యాప్స్ పాత్ర గురించి వివరించారు. స్టార్టప్ సెగ్మెంట్‌లో అవకాశాలు, సవాళ్లపై ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో చర్చించారు. కార్యక్రమంలో ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల, ప్రొఫెసర్ భగవాన్ చౌదరి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

గాలి కాలుష్యంతో శ్వాసవ్యాధుల ముప్పు

వైద్య నిపుణుడు వీరపనేని విష్ణున్‌రావు


డాక్టర్ విష్ణున్‌రావు

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు గాలి కాలుష్యం, మరోవైపు రసాయనాలతో ఉత్పత్తి చేసిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఉబ్బసం, శ్వాసకోశ వ్యాధుల ముప్పు ఉంటుందని, పర్యావరణాన్ని పరిరక్షించుకోకపోతే మానవ మనుగడే ప్రమాదంలో పడుతుందని ప్రముఖ వైద్య నిపుణుడు, శ్వాస హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ వీరపనేని విష్ణున్‌రావు పేర్కొన్నారు. శ్వాస సంబంధమైన వ్యాధులపై ఆయన కొన్ని దశాబ్దాలుగా పరిశోధనలు చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తులు, సైనస్, ఉబ్బసం వ్యాధులపై పరిశోధన సంస్థలు ఇచ్చే నివేదికలను కూడా అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయన వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు కొన్ని సూచనలు చేశారు. వర్షం నీటి తడివల్ల నేల, చెట్లు, భవనాలు, చెత్తాచెదారం ఒక విధమైన బ్యాక్టీరియాను కలిగి ఉంటాయని, గాలి కలుషితం ఎక్కువగా ఉంటుందన్నారు. వాతావరణం చల్లగా ఉందని రసాయనాలతో కూడిన పదార్థాలను ఫ్రై చేసి తినకూడదని, అలాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. హోటళ్లు, రోడ్ల పక్కన విక్రయించే ఆహార పదార్థాలు సాధారణంగానే తినకూడదని, రోజువారీ వ్యాయామం ఇతరత్రా జాగ్రత్తల వల్ల వ్యాధులను అదుపులో ఉంచుకోవచ్చని తెలిపారు. సమాచారం కోసం ఎప్పుడైనా తనను నారాయణగూడలోని శ్వాస హాస్పిటల్‌లో సంప్రదించవచ్చని సూచించారు.


ఓల్డుబోయినపల్లి: వర్షం కారణంగా జలమయమైన బాలానగర్ రోడ్డు


ఓల్డుబోయినపల్లి: బాలానగర్ బస్తీ అంతర్గత రోడ్డులో నిలిచిన వరదనీరు


కేపీహెచ్‌బీకాలనీ: వరద ప్రాంతాల్లో పర్యవేక్షిస్తున్న డీసీ రమేష్

కాలనీలు జలమయం

- తెరిపిలేని వాన.. రోడ్లను ముంచెత్తిన వరదనీరు
- కూలిన భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు

నిలిచిన రాకపోకలు

(జోన్‌బృందం, ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో జనజీవనం స్తంభించింది. భారీ వర్షాలకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. రోడ్లు, కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. వరద నీటితో పాటు మురుగునీరు చేరడంతో కాలనీలు మురుగుమయం అయ్యాయి. ఈదురు గాలుల కారణంగా భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు అపార్ట్‌మెంట్ల సెల్లార్లలోకి భారీగా వరద నీరు చేరింది. జంట నగరాల్లో రెడ్‌అలర్ట్ ప్రకటించిన దృష్ట్యా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు సూచించారు.

- కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని చింతల్ మార్కెట్టు వద్ద చెట్టు పడిపోయి, విద్యుత్ స్తంభం విరిగి ట్రాన్స్‌ఫార్మర్‌పై పడింది. దీం తో కరెంట్ నిలిచిపోయింది. ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మున్సిపల్, విద్యుత్ అధికారులు స్పందించి చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.
- లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద భారీగా వరదనీరు చేరడంతో రాత్రి నుంచే రాకపోకలు నిలిపివేశారు. మైహోం మంగళ, ఆర్‌ఓబీ, నెక్టార్‌గార్డెన్ ప్రాంతాల్లో జడ్సీ ఉపేందర్‌రెడ్డి అధికారులతో కలిసి పర్యటించారు. జోన్ వ్యాప్తంగా 15 మాన్‌సూన్ బృందాలు వరదనీటిని ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపడుతున్నాయి. ట్రాఫిక్ నిలిచిపోకుండా పర్యవేక్షిస్తున్నారు. ఓల్డుబోయినపల్లి డివిజన్‌లోని కళింగ ఎన్‌క్లేవ్ హైటెన్షన్ రోడ్డులో మూడు భారీ వృక్షాలు నేల కూలాయి. సమతానగర్‌లో కారుపై, జాగృతి ఎన్‌క్లేవ్‌లో ఇంటిపై, కళింగ ఎన్‌క్లేవ్‌లో బైకుపై చెట్లు కూలాయి.
- కూకట్‌పల్లి భాగ్యనగర్ కాలనీలో భారీ వృక్షం కూలి విద్యుత్ స్తంభంపై పడడంతో కరెంట్ వైర్లు తెగిపోయాయి. సమాచారం అందుకున్న విద్యుత్ సిబ్బంది చెట్టును తొలగించి విద్యుత్‌ను పునరుద్ధరించారు.


లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద భారీగా చేరిన వరదనీరు


గచ్చిబౌలి: సుదర్శన్‌నగర్‌లో జలమయమైన రహదారి


అల్లాపూర్ సఫ్దర్‌నగర్‌లో పర్యటిస్తూ ప్రజలకు భరోసా ఇస్తున్న కూకట్‌పల్లి ఏసీపీ, పోలీస్ అధికారులు


ఓల్డుబోయినపల్లి: సిబ్బందితో చెట్లను తీయిస్తున్న కార్పొరేటర్ నర్సింహ్మయాదవ్


అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సున్నం చెరువు


అల్లాపూర్: గాయత్రీనగర్‌లో కూలిన చెట్టు


అల్లాపూర్: విద్యుత్ తీగలపై చెట్టు పడటంతో నెలకొరిగిన స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్

ఎమర్జెన్సీ కంట్రోల్ రూం నంబర్లు

మియాపూర్: వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమయితే తప్పా ప్రజలు బయటకు రావొద్దని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సూచించారు. ఏదైనా సమస్య తలెత్తితే జీహెచ్ఎంసీ టోల్‌ఫ్రీ నంబర్ 040 - 21111111కు కానీ, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని గానీ సంప్రదించాలని ఆయన సూచించారు.

పేట్‌బషీరాబాద్ : కొంపల్లి మున్సిపల్‌లోని ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసరమైతే మున్సిపల్‌లో ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్ 79979 94231 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

- రాష్ట్రంలో మరో రెండురోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో ప్రభుత్వం జంటనగరాల్లో రెడ్‌అలర్ట్ ప్రకటించిన దృష్ట్యా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి సూచించారు. అత్యవసర సమయంలో బయటకు వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏదైనా సమస్యలు ఎదురయితే అధికారులకు తెలియజేయాలని అత్యవసర పరిస్థితిలో ఈ నంబర్లలో 9704601866, 9154901720 సంప్రదించాలని సూచించారు.

వరద బాధితులకు ఎమ్మెల్యే భోజన ఏర్పాట్లు


ట్రాలీలో తెచ్చి భోజన వితరణ చేస్తున్న వలంటీర్లు

అల్లాపూర్: అల్లాపూర్ డివిజన్ సఫ్దర్‌నగర్ దిగువ ప్రాంతంలో భారీగా వరదనీరు ఇళ్లలోకి చేరింది. దీంతో అనేక మంది ఇళ్లలో వంట కూడా చేసుకోలేని దుస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన సిబ్బందితో సఫ్దర్‌నగర్‌లోని ప్రజలకు భోజన ఏర్పాట్లు చేశారు. అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.


ఓల్డుబోయినపల్లి: కూలిన చెట్లను కట్ చేసి తొలగిస్తున్న సిబ్బంది


ఓల్డుబోయినపల్లి: కళింగ ఎన్‌క్లేవ్ హైటెన్షన్ లైన్‌లో నేలకొరిగిన చెట్టు


కేపీహెచ్‌బీకాలనీ: సాయినగర్‌లో కారుపై పడ్డ చెట్టు


ఓల్డుబోయిన పల్లి: విరిగి పడిన చెట్టు కింద ధ్వంసమైన బైకు


హైదర్‌నగర్: కూకట్‌పల్లి భాగ్యనగర్ కాలనీలో కూలిన చెట్టు, ఒరిగిన స్తంభం


అల్లాపూర్ డివిజన్ గాయత్రీనగర్‌లో..

ఉద్యోగుల ఎంపిక పారదర్శకంగా జరగాలి

బేగంపేట: ఉద్యోగుల ఎంపికలో పైరవీలకు తావులేకుండా పారదర్శకంగా జరగాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం బేగంపేటలోని హరితప్లాజాలో యూత్ ఫర్ యాంటి కరప్షన్ సంస్థ ఆధ్వర్యంలో 16 మంది నిజాయితీ అధికారులను సత్కరించి అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమానికి లక్ష్మీనారాయణతో పాటు రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆర్పీ పట్నాయక్, చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్ పాల్గొన్నారు.

స్మార్ట్‌కిట్స్ విద్యార్థుల ప్రతిభ


బహుమతి అందుకుంటున్న విద్యార్థి

చందానగర్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): చందానగర్, మదీనగూడ స్మార్ట్‌కిట్స్ ఎమ్స్ చిన్నారులు ప్రతిభ కనబరిచారు. శంషాబాద్ మేలోహ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో నలుగురు విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. పాటలు, కలరింగ్, శ్లోకాల్లో అంకిత, అక్షిత, దీక్ష, సహస్ర ప్రథమ స్థానంలో నిలిచారు. గెలుపొందిన విద్యార్థులను స్మార్ట్ కిడ్స్ స్కూల్స్ డైరెక్టర్ అజూంముబీన్ అభినందించారు.

నోటీసులతో హస్మత్‌పేట బస్తీవాసుల హైరానా.!

ఇళ్లు కూల్చుతారన్న ఆందోళనలో బస్తీ ప్రజలు


హస్మత్‌పేట్‌కు వచ్చిన మేయర్‌కు తమ బాధ చెబుతున్న మహిళలు (ఫైల్)

ఓల్డుబోయినపల్లి, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిర్మాణాలంటూ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు జారీ చేసిన నోటీసులతో ఓల్డుబోయినపల్లి డివిజన్ హస్మత్‌పేట ఎస్సీ బస్తీవాసులు హైరానా పడుతున్నారు. నోటీసులు జారీ చేసిన గడువు ముగుస్తుండడంతో అధికారులు ఎప్పుడు వచ్చి తమ ఇళ్లను కూల్చుతారోనని హడలెత్తిపోతున్నారు. ఏదైనా వాహనం బస్తీలోకి వస్తే చాలు ఆందోళన పడుతూ ఇంటి నుంచి బయటకు వచ్చి నిల్చుంటున్నారు. తమకు నోటీసులు అందగానే స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మయాదవ్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హస్మత్‌పేటను సందర్శించారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మికి తమ గోడును వెళ్లబోసుకున్నారు.

- **నేతలు హామీలిచ్చినా..**

పేదలకు నష్టం కలుగకుండా చేస్తామని నేతలంతా బస్తీవాసులకు హామీ ఇచ్చినప్పటికీ హైడ్రాపై పత్రికలు, మీడియాల్లో వస్తున్న కథనాలతో వారికి ఏం చేయాలో అంతుచిక్కడం లేదు. ఎన్ కన్వెన్షన్‌ను కూల్చివేసి పేరొందిన ఓ కాలేజీకి నోటీసులు జారీచేసి కూల్చివేస్తామని చెబుతుండడంతో బస్తీప్రజల్లో ఆందోళన మరింత రెట్టింపవుతోంది. ఏం జరుగుతుందోననే భయంతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ నర్సింహ్మయాదవ్ వద్దకు వెళ్లేందుకు సిద్ధపడ్డారు.

- **70 ఏళ్ల కిందటే బస్తీ**

దొరల కాలంలో (70 సంవత్సరాలు) ఎస్సీలు ఊరికి దూరంగా ఉండాలనే సూచనలతో 1964కు ముందు చెరువుకు పక్క 30 నుంచి 40 గుడిసెలు ఉండేవని బస్తీలోని వృద్ధులు చెబుతున్నారు. హస్మత్‌పేట గ్రామ సర్పంచ్‌గా లక్ష్మీనారాయణ, పట్వారిగా హనుమంతరావు, ఉప సర్పంచ్‌గా హరిజనబస్తీ నివాసి న్యాతరి బంగారయ్య ఉండేవారని వారు గుర్తు చేస్తున్నారు. అప్పటి హస్మత్‌పేట గ్రామ పంచాయతీకి పన్నులు చెల్లిస్తూ వచ్చామని బస్తీవాసులు చెబుతున్నారు. 1987లో టీడీపీ ప్రభుత్వం తమకు పట్టాలు కూడా ఇచ్చిందని తెలిపారు.

ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి కట్ట వేశారు

ఏడాదిన్నర క్రితం ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి వాకింగ్ ట్రాక్ వేసి ఐరన్ రాడ్లు కూడా వేసారు. ఇళ్లకు ఎలాంటి ఇబ్బంది ఉండదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధి అని అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను రోడ్డు పాలు చేయాలని చూస్తోంది.

- శంకరయ్య, రిటైర్డు ఉద్యోగి

టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టాలిచ్చారు

బోయిన్‌పల్లి మార్కెట్‌లో కూరగాయలు అమ్ముకుంటూ పైసా పైసా కూడబెట్టి 60 గజాల స్థలం కొనుక్కుని ఇల్లు కట్టుకున్నాను. అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో (1987) పట్టాలు ఇచ్చారు. ఇప్పుడేమో ఇల్లు చెరువులో ఉంది కూల్చుతామంటున్నారు. నీడ కోల్పోతే మేమంతా మూకుమ్మడిగా ఆత్మహత్యలు చేసుకోవాల్సిందే..

- స్వరూప